క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ ఎదుట చలివేంద్రం ప్రారంభం



రాజుపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు వేసవి తాపాన్ని తీర్చేందుకు మినరల్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేసి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనం మంచి అలవాటు

గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ



క్రోసూరు: పుస్తక పఠనం మంచి అలవాటు అని, విద్యార్థులందరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని మండల గ్రంథాలయ శాఖ అధికారి వై.వీరాంజమ్మ బుధవారం తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మూడవ రోజు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు జనరల్ నాలెడ్జిలో భాగంగా ముఖ్యమైన తేదీలు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, చెస్ మొదలగు గేమ్స్ నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి రోజు పుస్తక ప్రదర్శన జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగ పరుచుకోవాలని, మంచి అలవాట్లు వారి ఉన్నతికి కారణమవుతాయన్నారు. వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చిలో వేసవికాల విరామ తరగతులు



క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరులోని లూథరన్ చర్చిలో వేసవి కాల విరామ తరగతులు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ రెవ.ఎం.సుందరరావు బుధవారం తెలిపారు. విరామ తరగతులు ఐదు రోజులు పాటు జరుగుతాయన్నారు. ఈ తరగతులలో మండల పరిధిలో వందల మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు వివరించారు. విరామ తరగతులు చర్చి పాస్టర్స్ రెవ.డా. సుందరరావు, హెప్సిబా పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు బైబిల్ బోధనలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గురించి బోధించటం జరుగుతుంది. విరామ తరగతుల అనంతరం నిర్వహించే పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంఘ పెద్దలు, సండే స్కూల్ టీచర్స్, వలంటీర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

చల్లగుండ్ల వద్ద చలివేంద్రం ప్రారంభం



నకరికల్లు: వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడం పుణ్యకార్యమని ఎస్ఐ చల్లా సురేష్ అన్నారు. మండలంలోని చల్లగుండ్ల వద్ద వేల్పుల భూషయ్య /ాపకార్థం నిర్మించిన బస్టాండ్‌లో వేల్పుల రమణ /ాపకార్థం వేల్పుల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభించిన సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వేసవిలో దాహార్తితో ఉన్న ప్రజలకు మినరల్ వాటర్ చలివేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చిన దాత కోటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో సాగి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి అబ్దుల్లా, వీఆర్వో జి.లింగయ్య, ఎంపీటీసీ సభ్యుడు జక్కిరెడ్డి కోటిరెడ్డి, సానా వెంకట్రావు, అరవా నాగేశ్వరరావు, మడకా లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు అంటే లెక్క లేదా..?!

- మున్సిపల్ రోడ్డును కబ్జా చేస్తే కనీసం పట్టించుకోరా
- ఐదు సార్లు ఫోన్ చేస్తే ఒకసారి లిఫ్ట్ చేసిన కమిషనర్
- మున్సిపల్ స్థలాన్ని కాపాడకపోతే ధర్నాకు సైతం వెనుకాడను
- మున్సిపల్ వైస్ ఛైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ మండిపాటు



మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ



హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

సత్తెనపల్లి: ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని.. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామనే ఉద్దేశంతోనే.. ప్రజలు నమ్మి తమను ఎన్నుకున్నారని.. ప్రజా ప్రతినిధులు అంటే అధికార యంత్రాంగానికి లెక్క లేదా అని మున్సిపల్ వైస్ ఛైర్మన్, 3వ వార్డు కౌన్సిలర్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ మండిపడ్డారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు బుధవారం జరిగాయి.

ప్రభుత్వ ఆస్తులు కాపాడాలి

ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ పట్టణంలోని 30వ వార్డు రైల్వే స్టేషన్ రోడ్‌లో త్రికోటేశ్వర వైన్ షాప్‌కు ఎదురుగా 30 అడుగుల రహదారిని ఆక్రమించి పనులు చేస్తుంటే ఐదుసార్లు మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌కు ఫోన్ చేశానని, కేవలం ఒకసారి ఫోన్ లిఫ్ట్ చేసి పెట్టేశారని, మున్సిపల్ ఆస్తిని కబ్జా చేస్తున్నా కనీసం పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. బోగస్ సర్టిఫికెట్లు తీసుకొచ్చి స్థలం తమదంటే సర్వే సర్టిఫికెట్ ఎలా ఇచ్చారో అధికారులు చెప్పాలన్నారు. ఎవరి అండదండలతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని, ఇక్కడ నిత్యం ప్రజల రాకపోకలు సాగుతుంటాయన్నారు.

■ 2007–08లో అప్పటి ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి చొరవతో డ్రైన్ నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే డాక్టర్ కోడెల శివప్రసాదరావు వావిలాల స్మృతి వనం ఎదురుగా విశాలమైన రోడ్డు ఉండాలని సంకల్పించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంబటి రాంబాబు హయాంలో కూడా అభ్యంతరం చేయలేదన్నారు. 15 ఏళ్ల పాటు అభ్యంతరం లేని స్థలాన్ని కబ్జా చేయడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి మున్సిపల్ స్థలాన్ని స్వాధీనపరచుకొని రహదారిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ధర్నాకు దిగుతానని, మున్సిపల్ ఆస్తులు అన్యాక్రాంతం కావడానికి వీలు లేదన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్‌కుమార్, 4వ వార్డ్ కౌన్సిలర్ కటకం రామకృష్ణ సైతం రహదారి స్థలం కబ్జాదారులపై చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై డీఈ వెంకటరమణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా కమిషనర్ ఆనంద్ కుమార్‌కు విధులు కేటాయించారని, వచ్చిన తర్వాత మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారులకు నిషేధంపై నిబద్ధత ఏదీ

డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధించామని చెబుతూ టీ కొట్లు, చిన్న చిన్న బంకుల వద్ద పేపర్ గ్లాసులను, గ్యాస్ సిలిండర్లను స్వాధీన పరుచుకుంటూ హడావుడి చేస్తున్నారే తప్ప పెద్ద పెద్ద షాపులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పెద్ద షాపుల్లో రూ.లక్షలు విలువ చేసే సరుకు ఉందని, ఆ వ్యాపారులు అధికారులకు కనిపించడం లేదని, చిన్న వ్యాపారులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజా ప్రతినిధుల మైన తమకు కూడా పేపర్ గ్లాసుల్లోనే టీ ఇచ్చారని, ఇదేనా అధికారులకు నిషేధంపై ఉన్న నిబద్ధత అని విమర్శించారు.

■ 12వ వార్డు కౌన్సిలర్ లోకా కళ్యాణి మాట్లాడుతూ తమ వార్డులో హిందూ శ్మశాన వాటిక ఎదురు రోడ్డు అప్రూవల్ అయిన అభివృద్ధి పని ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ప్రజలు ఆ రోడ్డులో రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే రహదారి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు.

■ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ఏడో వార్డులో ప్రైవేట్ పట్టా స్థలంలో సర్వీసింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారని, ఇది వాల్టా చట్టాన్ని అతిక్రమించడమేనన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు కేటాయించిన కారు ఏమిటో స్పష్టంగా తెలియజేయాలని కోరారు. సాధారణ, అత్యవసర సమావేశాల్లో అజెండాల్లోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



క్రోసూరు: క్రోసూరు పంచాయతీ ఆధ్వర్యంలో నీటి ఎద్దటి తీవ్రంగా ఉన్న బజార్లకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు సెక్రటరీ వెంకయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రోసూరులోని కొండకింద బజారు, ముస్లింబజారు 10వ వార్డు, ఎన్టీఆర్ బజారు, ముదిరాజుల కాలనీ, సినిమాహాలు సెంటర్‌లలో ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రోజుకు రెండు నుంచి మూడు సార్లు ఆయా వీధుల్లో నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నీటిని సద్వినియోగ పరుచుకోవాలని ఈ సందర్భంగా సెక్రటరీ కోరారు.

ఘనంగా గంగాపార్వతి సమేత నగరేశ్వరస్వామి కల్యాణం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరి నగరేశ్వరస్వామి దేవాలయంలో గంగా పార్వతి సమేత నగరేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్లకు రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమ పూజలు , సాయంత్రం కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా ప్రతిష్ట వేడుకలు

నకరికల్లు: మండలంలోని త్రిపురాపురం గ్రామంలో ఆలయాల ప్రతిష్ఠామహోత్సవాలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో శిలా విగ్రహ స్థిర ప్రతిష్ఠా మహోత్సవాలు శాస్త్రోక్తంగా జరిపించారు. విఘ్నేశ్వరస్వామి వారి ధ్వజ స్తంభం, కల్యాణ వేంకటేశ్వరస్వామి, పోలేరమ్మ, పాతపాటేశ్వరి, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి, పోతురాజు స్వామి, అంకమ్మతల్లి, నీలంపాటి అమ్మవార్ల స్థిర విగ్రహాలు, జీవధ్వజ, కీర్తి ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శిలా విగ్రహ స్థిర ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా కల్యాణ వేంకటేశ్వరుని శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు. సమీప గ్రామాలతో పాటు పుట్టింటికి వచ్చిన ఆడపిల్లలు, బంధుగణంలో గ్రామం కిక్కిరిసింది. ధ్వజ స్తంభాలు ప్రతిష్ఠించే సమయంలో స్వామి వార్ల నామస్మరణలో భక్తులు పరవశించిపోయారు. మధ్యాహ్నం నుంచి చేపట్టిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. త్రిపురాపురం గ్రామంలో అత్యంత వైభవంగా జరిగిన ప్రతిష్ఠా మహోత్సవాల్లో వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బి బాషా, మద్దం సురేష్, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో సన్మానించారు. అనంతరం స్వామివార్లను దర్శించుకున్న ఆయన మొక్కులు చెల్లించారు.



ప్రతిష్ఠా మహోత్సవాలలో . ధ్వజ స్తంభం ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఘనంగా అక్షయ తృతీయ పూజలు

పెదకూరపాడు: పెదకూరపాడు మండలం 75త్యాళ్లూరు విఘ్నేశ్వర ఆలయంలో బుధవారం అక్షయ తృతీయ పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఈ రోజున చేసే దానములు, సమాజ హితం కోరే మంచి పనులు అక్షయమైన ఉన్నత ఫలితాలను ఇస్తాయని ప్రధానార్చకులు నుదురుపాటి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మంచినీటి చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో గొడుగు, పాదరక్షలు, మజ్జిగ వంటి దానాలతో పాటు పశుపక్షాదులకు నీరు, గ్రాసము ఏర్పాటు చేయడం శుభములను చేకూరుస్తుందన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సత్తెనపల్లి: అక్షయ తృతీయ పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాణ విశిష్టత కలిగిన ఈ పర్వదినాన పుణ్యం ఎంత చేస్తే క్షయం అనేది లేకుండా అంత మోక్ష ప్రాప్తి కలుగుతుందని శాస్త్రోక్తి. అలాగే అక్షయ తృతీయ వచ్చిందంటే కొంచెం బంగారం అయినా కొనుగోలు చేయాలని సెంటిమెంటు స్థిరపడిపోవడంతో బంగారు దుకాణాల్లో కొనుగోళ్లు కొంతమేర బుధవారం పెరిగాయి. పలు బంగారం దుకాణదారులు కూడా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించి దుకాణాల ఎదుట షామియానాలు ఏర్పాటు చేశారు. అయితే బంగారం ధరలు ఆకాశాన్ని అంటడంతో కొద్దిమందే కొనుగోలు జరిపినట్లు దుకాణాల నిర్వాహకులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలుపై స్పందించిన సివిల్ సప్లయిస్ శాఖ

సాక్షి ఎఫెక్ట్

క్రోసూరు: మండలంలో రబీలో వరి సాగు చేసిన రైతుల ధాన్యం ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించుకుని తీవ్రంగా నష్టపోతున్నట్లు బుధవారం 'గిట్టుబాటు కాక.. ప్రభుత్వం కొనక..' అని సాక్షిలో వచ్చిన కథనానికి జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు స్పందించారు. సివిల్ సప్లయిస్ శాఖకు చెందిన ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ ఇన్‌చార్జి ఏడుకొండలు మాట్లాడుతూ గురువారం ఆవులవారిపాలెం, దొడ్లేరులో సుమారు 500 బస్తాల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించుకునేందుకు రైతులకు వాట్సాప్ షెడ్యూలింగ్ నంబర్ 7337359375 అందుబాటులోకి తెచ్చామని, ధాన్యం విక్రయించుకోదలచిన రైతులు దాని ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఏ–1 గ్రేడ్ క్వింటా ధర రూ.2,320, సాధారణ రకం రూ.2,300కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. చెల్లింపులు కూడా ధాన్యం కొనుగోలు చేసిన రెండు మూడు రోజుల్లో జరుగుతాయని తెలిపారు. కావున ధాన్యం సాగు చేసిన రైతులు అధైర్య పడవద్దని ఆయన సూచించారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

దాచేపల్లి చైర్‌పర్సన్ సుబ్బమ్మ

దాచేపల్లి: వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ కోరారు. దాచేపల్లి సచివాలయం–1లో కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చేపట్టే పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన బోర్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. మంచినీటిని నిల్వ చేసే ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని, సురక్షితమైన నీటిని మాత్రమే ప్రజలకు అందించాలని కోరారు. నగర పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో కమిషనర్ వైవీ అప్పారావు, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్‌బీ, పాల్గొన్నారు.



నగర పంచాయతీ సమావేశం అధ్యక్షత స్థానంలో చైర్‌పర్సన్

బాల్య వివాహాలపై అవగాహన పెంచండి



మాదల(ముప్పాళ్ళ): బాల్య వివాహాలపై అవగాహన మరింత పెంచాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రశాంత్ చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి పరిధిలోని ఇరుకుపాలెం సెక్టార్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రశాంత్ కిశోర వికాసం సమ్మర్ క్యాంపైన్ గురించి వివరించారు. బాలల హక్కులు, చట్టాల గురించి, అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ టీ సంతోషకుమారి, అవుట్ రీచ్ వర్కర్ నాసమ్మ, సూపర్‌వైజర్ జీ జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలి



రాజుపాలెం: ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసినట్లయితే దానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఏపీడీ పీవీ నారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి 11 వరకు పనిచేయాలని, రోజుకు రూ.300కు తగినట్లుగా కొలతలు ఇస్తారని, సమయపాలన పాటించండి అని తెలిపారు. అటెండెన్స్ కాగితాలను పరిశీలించారు. పేర్లవారీగా పిలిచి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీవో మాట్లాడుతూ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొలతల ప్రకారం చేయాలని సూచించారు.

ఇండియన్ ఐకాన్ స్కూల్ గుర్తింపు పునరుద్ధరణ

సత్తెనపల్లి: మండలంలోని కొమెరపూడి గ్రామంలో గల ఇండియన్ ఐకాన్ స్కూల్ గుర్తింపును పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ పునరుద్ధరించినట్లు సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు చేసుకోవచ్చునన్నారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను కొమెరపూడిలోని ఇండియన్ ఐకాన్ స్కూల్లో చేర్పుకోవచ్చన్నారు.

రాజధాని ఉంటేనే అన్ని రంగాలు అభివృద్ధి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: దేశమైనా, రాష్ట్రమైనా రాజధాని తప్పనిసరి అని, రాజధాని ఉంటేనే అన్ని రంగాల అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని తన కార్యాలయంలో మే 2న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై బుధవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అమరావతి పేరు ప్రపంచమంతా వినిపించేలా, దేశం గర్వించేలా మోదీ సభను విజయవంతం చేద్దామన్నారు. కూటమి నాయకులు, శ్రేణులు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అమరావతి పునర్నిర్మాణ వేడుకలో భాగస్వాములు కావాలన్నారు. రాజధాని నిర్మాణంతో రాష్ట్రానికి పరి శ్రమలు, పెట్టుబడులు వచ్చి భూముల ధరలు పెరిగి ప్రజల జీవనచిత్రమే మారిపోతుందన్నారు. మే 2న అమరావతిలో జరిగే ప్రధాని మోదీ బహిరంగసభ విజయ వంతానికి కూటమి నేతలంతా కలిసి కట్టుగా కృషిచేయాలని కోరారు. ప్రధాని బహిరంగ సభ విజయవంతంపై కూటమి శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ప్రోగ్రాం పరిశీలకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు తాత జయ ప్రకాష్ నారాయణలు మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ జాస్తి వీరాంజనేయులుకు దేశ్‌రత్న పురస్కారం

అమరావతి: మండల పరిధిలోని పెదమద్దూరు గ్రామానికి చెందిన డాక్టర్ జాస్తి వీరాంజనేయులుకు దేశ్‌రత్న పురస్కారం లభించటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. మంగళవారం రాత్రి ఢిల్లీలోని మండి హౌస్ కామాని ఆడిటోరియంలో జమ్మూకశ్మీర్ టూరిజం శాఖ, ఢిల్లీలోని భారత్ యువ సంక్షేమ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ప్రతిష్టాత్మకమైన దేశ్ రత్న పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి రఘురాజ్ సింగ్ వీరాంజనేయులను సత్కరించి మెడల్, షీల్డ్‌ను బహూకరించారు. గత కొన్నేళ్లుగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు చేస్తున్న సామాజిక సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ పర్యాటక శాఖ కార్యదర్శి కమిషనర్ యశ ముద్దుగల్, బాలీవుడ్ నటులు సురేంద్ర పాల్ సింగ్, ముస్తాక్ ఖాన్, బీజేపీ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు శ్యామ్‌జాజు, మోహిత్ నారాయణ, సుమిత్ ఆయనను సన్మానించారు.

నాణ్యమైన నారును రైతులకు విక్రయించాలి

సీఐ పి.కిరణ్

రాజుపాలెం: రైతులకు నాణ్యమైన నారును సరఫరా చేయాలని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ సూచించారు. మండలంలోని నర్సరీ యజమానులతో బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలైన విత్తనాలు వాడి నాణ్యమైన నారును ఉత్పత్తి చేయాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యాన అధికారి దాసరి నవీన్‌కుమార్ మాట్లాడుతూ అన్ని రకాల వివరాలతో కూడిన రిజిస్టర్‌లు నమోదు చేయాలన్నారు. కొనుగోలు చేసిన నారుకు రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. నర్సరీలో బెడ్ నంబర్‌లు నమోదు చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ వేణుగోపాల్, వ్యవసాయాధికారి వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



నర్సరీ యజమానులకు సూచనలిస్తున్న సీఐ పి.కిరణ్

రోడ్డుపైనే డ్రైనేజీ వాటర్..!

సత్తెనపల్లి: పట్టణ అచ్చంపేట రోడ్‌లోని సాయి కృష్ణ థియేటర్ పక్కన కందిపప్పు మిల్లు ఎదురు డ్రైనేజీ వాటర్ సైడ్ కాలువలోకి వెళ్లకుండా రోడ్డుపై ప్రవహిస్తున్నా అధికారులకు పట్టడం లేదు. ఈ రహదారిపై ప్రయాణం చేసే ప్రయాణికులు మురుగు నీటి నుంచి వచ్చే దుర్గంధంతో బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఆ నీటిలో నుంచి ప్రయాణిస్తుండటంతో రోడ్డుపై నడిచే వారిపై మురుగు నీరు పడి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు నీటిని డ్రైనేజీ కాలువలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



వేసవిలో ఉపాధి పనులు కల్పించాలి

మాచర్ల: గ్రామాల్లో వేసవి కాలంలో ఉపాధి హామీ పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు కీలక పాత్ర పోషించాలని మండల ఉపాధి హామీ అధికారి పి.నాగశ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఎండ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. మంచినీటి సౌకర్యంతోపాటు మధ్యాహ్నం లోపు పనులు ముగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. వేతనదారులకు ప్రధాని సురక్ష బీమా పథకం సంవత్సరానికి రూ.20 వేలు చెల్లిస్తే రూ.2 లక్షలు బీమా పొందవచ్చు అన్నారు. జీవన జ్యోతి బీమా పథకంలో భాగంగా రూ.430 చెల్లిస్తే సాధారణ, ప్రమాద భరిత తదితర వారికి బీమా వర్తిస్తుందన్నారు. అవకాశాన్ని వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా ప్రతి గ్రామంలో సేద్యపు గుంతలు, ఇంకుడు గుంతలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు కిషోర్, వెంకయ్య, ఆపరేటర్ వేముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న పి.నాగశ్రీనివాసరావు

దేవాలయంలో చందనోత్సవం



గురజాల: నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలోని పల్నాడు యాదాద్రి నరసింహ స్వామి దేవాలయంలో చందనోత్సవం బుధవారం నిర్వహించారు. అక్షత తృతీయను పురస్కరించుకుని పల్నాడు యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారికి సుమారుగా 60 కిలోల గంధంతో చందన అలంకరణ చేశారు. స్వామిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులుతీరారు. ఈనెల 10వ తేదీన నిర్వహించాల్సిన కల్యాణాన్ని పురస్కరించుకుని స్వామివార్లకు మంగళస్నానం పెళ్లి కుమారుడిగా , అమ్మవార్లను తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. నిజరూపంలో స్వామి వారిని దర్శించుకున్నారు.